క్లుప్తంగా

3 రోజుల పాటు 144 సెక్షన్ అమలు

పీసీపల్లి: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మండలంలో మూడు రోజుల పాటు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్సై రమేష్‌బాబు తెలిపారు. అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు ఏర్పాటు చేస్తే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒక్కసారి కేసు నమోదైతే కెరీర్ నాశనమవుతుందన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉలవపాడు: మండల పరిధిలోని వీరేపల్లిలోని మోడల్‌స్కూల్‌లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 సంవత్సరానికి గాను 6,7,8,9, ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 7 లోగా పాఠశాల నందు దరఖాస్తు చేయాలన్నారు. 10న పాఠశాలలో జరిగే ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామన్నారు. రిజర్వేషన్ వారీగా సీట్లు కేటాయిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు

గుడ్లూరు: విద్యార్థులు ప్రతి రోజు గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు పఠనం చేయడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని గ్రంథపాలకుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. వేసవి శిక్షణలో భాగంగా స్థానిక ఎర్రన గ్రంథాలయంలో ఆదివారం పుస్తక పఠనం, చదవడం మాకిష్టం, పుస్తక ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు మాట్లాడుతూ వేసవి సెలవులలో విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి అందులో ఉన్న వివిధ రకాల పుస్తకాలను చదువుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

12 మద్యం బాటిళ్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై

పామూరు: పరిమితికి మించి మద్యం మద్యం తరలిస్తున్న వ్యక్తిని ఆదివారం రాత్రి అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం సైదుబాబు తెలిపారు. అతని వద్ద నుంచి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు. ఎక్కడైనా అక్రమంగా మద్యం తరలిస్తుంటే సమాచారం ఇవ్వాలన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు


వేములపాడులో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

హనుమంతునిపాడు: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఉల్లంఘిన వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం వేములపాడు సెంటర్‌లో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో 144 సెక్షన్, 30 యాక్టు అమల్లో ఉంటుందన్నారు. కౌంటింగ్ తరువాత సంబరాలు నిర్వహించడం, బాణసంచా కాల్చడం నిషేధమన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై శివనాగరాజు, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు పోటీలు


ఉలవపాడు గ్రంథాలయంలో నడకపందెం పోటీలు

ఉలవపాడు: స్థానిక శాఖా గ్రంథాధాలయంలో విద్యార్థులకు వేగంగా నడక పందెం పోటీలు నిర్వహించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు పోటీలు జరిపారు. విద్యార్థుల మానసిక ఆనందం కోసం పోటీలు నిర్వహించారు. మొత్తం 47 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులతో నీతికథలు, జాతీయ నాయకుల చరిత్రలు చదివించారు. క్యాంపు చివరి రోజు 7వ తేదీన విద్యార్థులకు బహుమతులు అందచేయనున్నట్లు గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు తెలిపారు.

5వ తేదీ వరకు 144 సెక్షన్

సింగరాయకొండ: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మండలంలో ఈనెల 5వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్సై టి.శ్రీరామ్ తెలిపారు. ఈ నెల 5వ తేదీ వరకు మద్యం షాపులు మూసివేస్తారన్నారు. 4వ తేదీన ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా మండలంలోని అన్ని దుకాణాలు మూసివేసి దుకాణదారులు సహకరించాలని కోరారు. ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక బాణసంచా కాల్చేందుకు అనుమతి లేదని, నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


లెక్కింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్వో పీ జాన్ ఇర్విన్, చీఫ్ ఏజెంట్లు (ఫైల్)


లెక్కింపు కేంద్రం వద్ద ఏర్పాట్లు

టిక్..టిక్..టిక్

- కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్ షురూ..
- 48 గంటల్లో తేలనున్న అభ్యర్థుల భవిత్యం..
- మొత్తం 2,40, 079 ఓట్లు.
- ఈవీఎంలలో పోలైన ఓట్లు 2,04,315
- పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 2,807


బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

కనిగిరి రూరల్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. ఈ నెల 4న మంగళవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది. ఈ మేరకు అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. కనిగిరి నియోజకవర్గ అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థుల ఎన్నికల కౌంటింగ్ ఒంగోలు రైజ్ గాంధీ కాలేజీలో జరగనుంది. కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 6 గంటలకే కేంద్రాల వద్దకు రావాలని ఆర్వో పాలపర్తి జాన్ ఇర్విన్ తెలిపారు. కౌంటింగ్ ఏజెంట్లు తప్పనిసరిగా ముందుగానే తమ ఐడీ కార్డులను తీసుకోవాలని అధికారులు తెలిపారు. ఎందుకంటే కనీసం కిలోమీటర్ దూరంలో వాహనాలు నిలిపి వేస్తారని, అక్కడి వచ్చిన తర్వాత మరొకరు ఐడీ కార్డు ఇస్తారంటే ఇబ్బంది పడతారన్నారు. ఐడీ కార్డు చూపిన తర్వాతే వాహనాలు నిలిపిన ప్రదేశంలో నుంచి లోపలికి పంపే ప్రక్రియ జరుగుతుందని పోలీస్ అధికారులు తెలిపారు.

నియోజకవర్గంలో 2,04,315 ఓట్లు పోలింగ్

మే 13న జరిగిన పోలింగ్‌లో నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 297 పోలింగ్ బూత్‌లలో మొత్తం 2,40, 079 ఓట్లకు గాను ఈవీఎంలలో 2,04, 315 ఓట్లు పోలయ్యాయి. ఇవి కాకుండా పోస్టల్ బ్యాలెట్, హోం, సర్వీసు బ్యాలెట్ ఓట్లు మొత్తం 2,807 పోలైనట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం 2,07,122 ఓట్లు లెక్కింపుల్లో అభ్యర్థుల్లో భవిష్యత్ తేలనుంది.

22 రౌండ్లలో ఫలితాలు..

సార్వత్రిక ఎన్నికల లెక్కింపు ఫలితాలు కనిగిరి నియోజకవర్గానికి సంబంధించి 22 రౌండ్లలో తేలనున్నాయి. లెక్కింపుకు మొత్తం 14 టేబుళ్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ప్రత్యేకంగా మరో 5 టేబుళ్ల ఏర్పాటు చేశారు.

లెక్కింపు ఇలా..

ఎన్నికల లెక్కింపు కౌంటింగ్ తొలుత హెచ్‌ఎంపాడు మండలం నుంచి ప్రారంభమై, పామూరు మండలంతో ముగుస్తోంది. పోలింగ్ బూత్ నెంబర్ 1–29 వరకు హెచ్ ఎంపాడు మండలం, 30–63 వెలిగండ్ల మండలం, 64–106 సీఎస్‌పురం మండలం, 107–190 కనిగిరి టౌన్, రూరల్ మండలం, 191–229 పీసీపల్లి మండలం, చివరిగా 230– 297 పామూరు మండలంతో లెక్కింపు పూర్తవుతుంది.

150 మందిపై బైండోవర్ కేసులు నమోదు

కౌంటింగ్ తర్వాత గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట చర్యలు చేపట్టారు. ఈమేరకు పోలింగ్ తర్వాత నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 150 మందిపై బైండోర్ కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. బైండోవర్ అయిన వారు నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు జరిమానా ఉంటుందని, కఠిన చర్యలు ఉంటాయని పోలీస్ అధికారులు తెలిపారు. ఇప్పటికే ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ కనిగిరిలో పోలీస్ డివిజన్ పరిధిలోని 9 మండలాల రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. కౌంటింగ్ తర్వాత గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కల్గించినా, ఎటువంటి హింసాత్మతక ఘటనలకు పాల్పడినా, గొడవలు ప్రేరేపిత చర్యలు చేసినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విజయోత్సవ ర్యాలీలపై నిషేధం విధించారు.

ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బుర్రా


సమావేశంలో పాల్గొన్న కౌంటింగ్ ఏజెంట్లు

- కచ్చితంగా వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుంది
- కౌంటింగ్ ప్రక్రియ సామరస్యంగా సాగేలా వైఎస్సార్ సీపీ ఏజెంట్లు సహకరించాలి
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్

కందుకూరు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్ సీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కౌంటింగ్ ఏజెంట్ల శిక్షణలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల కౌంటింగ్‌లో పాల్గొనే ఏజెంట్లు సహనంగా ఉండాలన్నారు. ప్రతి పక్షాలు ఎన్ని కుట్రలు చేసినా ధర్మం, న్యాయం గెలుస్తుందనే నమ్మకం ఉందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్ల పాలనా కలంలో రాష్ట్రంలో ప్రతి వర్గానికి న్యాయం చేశామని, సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి జరిగిందని వివరించారు. ఈ పరిస్థితుల్లో ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్ సీపీకే అండగా నిలశారని, ఓటు రూపంలో తమ అభిమానాన్ని చాటుకున్నారని వివరించారు. మరోసారి వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తామని స్పష్టం చేశారు. కందుకూరులో కూడా అద్భుతమైన మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని, ప్రతి ఒక్కరూ ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారని వివరించారు. వైఎస్సార్ సీపీ అంటేనే క్రమశిక్షణ ఉన్న పార్టీ అని, ఇదే క్రమశిక్షణను రేపు కౌంటింగ్ ప్రక్రియలో కూడా ఏజెంట్లు ప్రదర్శించాలని సూచించారు. వీలైనంత వరకు ఏజెంట్లు అంతా అప్రమత్తంగా ఉండడంతో పాటు, సహనంతో వ్యవహరించాలన్నారు. తప్పులు జరుగుతుంటే వెంటనే గుర్తించి అధికారుల దృష్టికి తీసుకురావాలని, తప్పులు ఎత్తిచూపాలే గానీ గొడవలు, ఘర్షణలకు దిగవద్దని హితబోధ చేశారు. అలాగే కౌంటింగ్ ఏజెంట్లుగా నియమితులైన ప్రతి ఒక్కరూ మంగళవారం ఉదయం 6 గంటల కల్లా కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని కోరారు. ఏజెంట్లు అవసరమైన అన్ని సౌకర్యాలు పార్టీ తరుపున చేశామని, ప్రశాంతంగా కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.

వైభవంగా గోపూజ, మహానివేదన


ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు


మహానివేదన ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు


గోపూజలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రం మండలంలోని మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయంలో ఆదివారం గోపూజ, మహానివేదన కార్యక్రమం అర్చకులు మంకాల సత్యనారాయణ, శివప్రసాద్‌శర్మలు వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజాహాలులో గోపూజ నిర్వహించారు. ఉదయం నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి, ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి గర్భాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం భజంత్రీల మేళతాళాలనడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకోగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ


విజేతలతో గ్రంథపాలకుడు కోటేశ్వరరావు

కొండపి(సింగరాయకొండ): వేసవి శిక్షణలో భాగంగా విద్యార్థులకు జూనియర్స్, సీనియర్స్ విభాగంలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేసినట్లు కొండపి గ్రంథపాలకుడు బి.కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయం ఒక పుస్తక భాండాగారమని, ప్రతి విద్యార్థి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. పుస్తక పఠనం ప్రతి ఒక్కరిని సన్మార్గంలో నడిపి మంచి ప్రవర్తనను తీసుకొస్తుందని తెలిపారు. విద్యార్థులకు కథలు చెప్పడం, కథల పుస్తకాలు చదివించడం, దేశ నాయకుల చరిత్ర గురించి తెలియజేయడం జరిగిందన్నారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. శిక్షణలో 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి


టంగుటూరు గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

టంగుటూరు: వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ వర్ధనరాజు పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరానికి విశేష స్పందన లభిస్తోందని ఆదివారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించండి

గుడ్లూరు: ఓట్ల లెక్కింపు సందర్భంగా నియోజకవర్గంలో గుర్తించిన సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏఎస్పీ ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎస్సైలు, సీఐలతో ఏఎస్పీ ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు, గొడవలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ప్రజలు గుంపులుగా ఉండకుండా చూడాలన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ సిబ్బందిని నియమించాలన్నారు. కందుకూరు పట్టణంలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సమీక్షలో డీఎస్పీ శ్రీనివాస్, గుడ్లూరు, కందుకూరు సీఐలు సుబ్బారావు, నఫీజ్, ఎస్సైలు పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగ శిలలకు ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

దద్దాలను సన్మానించిన ముస్లింలు


దద్దాల నారాయణను సన్మానిస్తున్న ముస్లింలు

పామూరు: పామూరులో జరిగిన పలు కార్యక్రమాలకు వైఎస్సార్ సీపీ కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ ఆదివారం హాజరయ్యారు. ఈసందర్భంగా స్థానిక అనిల్ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో ముస్లింలు దద్దాలను, జెడ్పీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంగాసాని హుసేన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ షేక్.రషీద్, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డిలను సన్మానించారు. మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, రజాక్, ఈనాడు హాజీ, షేక్.షబ్బీర్, బారాషరీఫ్, షేక్.మహబూబ్‌బాషా పలువురు పాల్గొన్నారు.

గంగా భవానీ తిరునాళ్ల ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో గంగాభవానీ మూలవిగ్రహమూర్తి, బొల్లావులు


తిరునాళ్లకు ముస్తాబైన గంగాభవానీ ఆలయం

పామూరు: మండలంలోని మోపాడు రిజర్వాయర్ వద్ద గంగాభవానీ ఆలయంలో గంగాభవానీ అమ్మవారి తిరునాళ్ల ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అర్చకులు గంగాభవానీ మూల విగ్రహమూర్తికి పంచామృతాభిషేకం, చందనాభిషేకం, కుంకుమాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా అమ్మవారిని, బొల్లావులను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. ఆలయాన్ని ప్రత్యేక విద్యుద్దీపాలంకరణలో శోభాయమానంగా అలంకరించారు. భక్తులు పూజల్లో పెద్దసంఖ్యలో పాల్గొనగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పాఠశాల భవనానికి విరాళం


విరాళం చెక్కు అందజేస్తున్న దాత నారాయణరెడ్డి

పామూరు: స్థానిక శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో తరగతి గది నిర్మాణానికి రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు విరాళం ప్రకటించారు. ఈసందర్భంగా ఆదివారం రాత్రి విరాళం చెక్కు రూ.5,01,116 లను పాఠశాల కమిటీ సభ్యులు పులవర్తి రఘుపతిరావు, దరిశి మస్తాన్‌రావులకు అందజేశారు. పాఠశాల కమిటీ సభ్యులు మాట్లాడతూ తరగతి గదులు కొరతగా ఉన్నాయని దాత సాయంతో ఒక గది నిర్మాణం చేపడతామన్నారు. రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు బి.జయరామిరెడ్డి, వాసవీకన్యకా పరమేశ్వరి దేవస్థాన చైర్మన్ యేల్చూరి బాలకొండలరావు, దరిశి సత్యనారాయణ, కొట్టే వెంకటేశ్వర్లు, పలువురు పాల్గొన్నారు.

గొడవలు సృష్టిస్తే క్రిమినల్ చర్యలు


మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు


పోలీస్ కవాతు

- సీఐ దాసరి వెంకటేశ్వరరావు

కనిగిరి రూరల్: కౌంటింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా.. అల్లర్లు సృష్టించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ దాసరి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంతో పాటు, మండలంలోని చాకిరాల, పేరంగుడిపల్లి తదితర గ్రామాల్లో పోలీసు బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ డి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా 30 పోలీస్ యాక్ట్ అమలు ఉందన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సెక్షన్ 144 అమల్లో ఉందని, ఎక్కడా నల్గురు గుమ్మిగూడి ఉండరాదన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన వారిపై తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టే పోస్టింగ్‌లు పెట్టినా.. గొడవలు సృష్టించినా, బాణా సంచా కాల్చిన, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించినా తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎస్సై టి.త్యాగరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ తిరునాళ్ల


పొట్టిరెడ్డిపాలెంలో పూజలందుకుంటున్న పోలేరమ్మతల్లి


భక్తులతో నిండిన ఆలయం

మద్దిపూడి: మండలంలోని పొట్టిరెడ్డిపాలెంలో పోలేరమ్మ తిరునాళ్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఆలూరి మాల్యాద్రి, బాపనపల్లి ఓబయ్య అమ్మవారిని పుసుపు, కుంకుమ, పూలమాలలు, పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. ఆలయం ఎదుట బొమ్మను వేసి బైనేటివారితో భక్తులకు కథ వినిపించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన కుంకుమ బండ్లతో గుడిచుట్టూ ప్రదక్షిణ చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తిరునాళ్ల సందర్భంగా అమ్మవారి పూజా కైంకర్యాలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.